క్లుప్తంగా

ఎస్పీకి ఆహ్వానం

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ రోహిత్‌రాజును బుధవారం జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి రాజేంద్రప్రసాద్, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ సావిత్రి మర్యాదపూర్వకంగా కలిసి, శాలువాతో సన్మానించారు. మాట్లాడుతూ.. ఫిబ్రవరిలో కొత్తగూడెంలో జరగనున్న రాష్ట్రస్థాయి మాస్టర్ బ్యాడ్మింటన్ పోటీల ప్రారంభ వేడుకలకు రావాలని ఎస్పీకి ఆహ్వానం పలికామని తెలిపారు.

కార్మికులకు బీమా



బీమా తీసుకున్న కార్మికులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా రామవరం సివిక్ విభాగంలో పనిచేస్తున్న 42 మంది కాంట్రాక్ట్ కార్మికులకు బుధవారం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు రిలేషన్ షిప్ మేనేజర్ కే.ప్రసాద్ రూ.40 లక్షల ఇన్సూరెన్స్ చేయించారు. ప్రసాద్ మాట్లాడుతూ.. కార్మికుల రన్నింగ్ వేతన ఖాతాలకు ప్రీమియం చెల్లించకుండానే ప్రమాదం జరిగినప్పుడు బీమా చెల్లించనున్నట్లు చెప్పారు.

ఇతరులకు సాయం అందించండి..



పండ్లు పంపిణీ చేస్తున్న రాము

కొత్తగూడెంఅర్బన్: సమాజంలో అందరూ ఇతరులకు సాయం అందించి ఆదుకోవాలని సింగరేణి కార్మికుడు వాంకుడోత్ రాము అన్నారు. తన తల్లి వర్ధంతి సందర్భంగా బుధవారం రామవరంలోని ఎంసీహెచ్ ఆస్పత్రిలో, బస్టాండ్ సెంటర్‌లో వృద్ధులు, యాచకులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. మాట్లాడుతూ... ఉన్నదానిలో కొంత ఇతరులకు సాయం చేయడం అలవర్చుకోవాలన్నారు.

కార్తీక్‌కు అభినందన

పాల్వంచ: ఇటీవల యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా చీకటి కార్తీక్ ఎన్నికయ్యారు. ఈ మేరకు బుధవారం పాత పాల్వంచలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు కార్తీక్‌ను అభినందించారు. మతిన్, వెంకటేష్, తాటి పవన్, పైడిపల్లి మహేష్ పాల్గొన్నారు.

18న ఇఫ్టూ విలీనసభ

సింగరేణి(కొత్తగూడెం): ఈనెల 18న కొత్తగూడెంలో జరగనున్న ఇఫ్టూ విలీనసభను జయప్రదం చేయాలని సంఘం ఉపాధ్యక్షుడు సీతారామయ్య పిలుపునిచ్చారు. బుధవారం కొత్తగూడెంలోని జిల్లా కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో, రాష్ట్రంలో ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేస్తూ కార్పొరేట్ విధానాలకు అనుగుణంగా కార్మికుల శ్రమ దోపిడీ చేస్తున్నాయని విమర్శించారు. ఇందులో భాగంగా 18న జరగనున్న తెలంగాణ రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని జేఏసీ పిలుపునిచ్చిందన్నారు.

సత్తాచాటిన కానిస్టేబుల్



రాణిని అభినందిస్తున్న అధికారులు

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి పోలీసు స్టేషన్, చుంచుపల్లి సర్కిల్‌లో పనిచేస్తున్న మహిళా కానిస్టేబుల్ కె.రాణి తెలంగాణ స్టేట్ నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్‌లో సత్తాచాటారు. హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో 4, 5 తేదీలలో జరిగిన చాంపియన్‌షిప్ పోటీల్లో హైజంప్, లాంగ్‌జంప్, ఐదు కిలోమీటర్ల పరుగు పందెంలో మూడోస్థానాన్ని కైవసం చేసుకున్నారు. ఈ మేరకు బుధవారం పోలీసు స్టేషన్‌లో సీఐ వెంకటేశ్వర్లు, లక్ష్మీదేవిపల్లి ఎస్సై రమణారెడ్డి, సబ్ డివిజన్ అధికారులు రాణిని అభినందించారు.

జేసీబీ, ట్రాక్టర్ సీజ్

జూలూరుపాడు: మండల కేంద్రంలో మంగళవారం రాత్రి అక్రమంగా ప్రభుత్వ భూమిలో జేసీబీతో మట్టి తవ్వి ట్రాక్టర్‌లో తరలిస్తుండగా పోలీసులు పట్టుకొని సీజ్ చేశారు. జూలూరుపాడు గ్రామానికి చెందిన అనిల్ మట్టి తరలిస్తున్నారని సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని జేసీబీ, ట్రాక్టర్‌ను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై రవి తెలిపారు.

కలప వేలం

ఇల్లెందు: ఇల్లెందు అటవీశాఖలోని టింబర్ డిపోలో ప్రతీనెల 8వ తేదీన కలప వేలంపాట జరుగుతుంది. బుధవారం జరిగిన వేలంపాటలో సుమారు రూ.18 లక్షల విలువైన తునికి, టేకు, ఇతర జాతులకు చెందిన కలపను పాడుకున్నారు. ఈ కార్యక్రమంలో సీఎఫ్ఓ భీమా నాయక్, ఎఫ్‌డీఓ కోటేశ్వరరావు, రేంజర్ ప్రసాద్ పాల్గొన్నారు.

పాపకొల్లు రోడ్డుకు మహర్దశ

- రహదారి విస్తరణకు రూ.5 కోట్లు మంజూరు
- 15 గ్రామాల ప్రజల కల సాకారం



జూలూరుపాడులో రద్దీగా ఉన్న పాపకొల్లు రోడ్డు

జూలూరుపాడు: జూలూరుపాడు – పాపకొల్లు ఆర్ అండ్‌బీ రహదారికి మహర్దశ పట్టనుంది. మండల కేంద్రంలోని తల్లాడ – భద్రాచలం రాష్ట్రీయ రహదారి నుంచి పాపకొల్లు వరకు ప్రస్తుతం ఉన్న సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డుగా విస్తరించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ ట్రస్టు (డీఎంఎఫ్‌టీ) రూ.5 కోట్లు మంజూరు చేసింది. జూలూరుపాడు నుంచి వయా పాపకొల్లు మీదుగా చీపురుగూడెం వరకు 12 కిలోమీటర్ల దూరం సింగిల్ బీటీ రోడ్డు ఉండటంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. ఈ రహదారి పరిధిలో 15 గ్రామాల ప్రజలు రాకపోకలు కొనసాగిస్తుంటారు. ప్రధానంగా జూలూరుపాడు నుంచి పాపకొల్లు వరకు రహదారి మధ్యదూరం 3.4 కిలోమీటర్లు ఎదురెదురుగా వాహనాలు వస్తే తప్పుకోవడానికి వీలులేకుండా ఉంది. మండల కేంద్రంలో పాపకొల్లు వెళ్లే రహదారిలోనే ఎస్‌బీఐ, తెలంగాణ గ్రామీణ బ్యాంకులు ఉండటంతోపాటు, సహకార సంఘం కార్యాలయం, ప్రభుత్వాస్పత్రి, పాఠశాలలు ఉండటంతో వాహనాల రాకపోకలకు మరింత ఇబ్బందిగా ఉంటుంది. బ్యాంకు ఖాతాదారులు, రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ఆస్పత్రికి రోగులకు నడిచి వెళ్లడం కష్టతరంగా మారింది. ఈ క్రమంలో వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ కృషి ఫలితంగా రోడ్డు మంజూరు కావడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పనులను ప్రారంభించాల్సి ఉంది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో 2022లో జూలూరుపాడు ప్రధాన సెంటర్‌లో తల్లాడ – భద్రాచలం రాష్ట్రీయ రహదారి విస్తరణ, డ్రెయినేజీలు, డివైడర్‌పై గ్రిల్స్, సెంట్రల్ లైటింగ్ జూలూరుపాడు – చీపురుగూడెం వరకు రూ.5.22 కోట్లలో పనులు పూర్తయ్యాయి. అయితే జూలూరుపాడు – చీపురుగూడెం రోడ్డు విస్తరణ పనులు చేపట్టకపోవడంతో ఈ నిధుల్లో రూ.88 లక్షలు మిగిలి ఉన్నాయి. వీటితో జూలూరుపాడు –పాపకొల్లు రోడ్డులో 600 మీటర్ల మేర మండల కేంద్రం వెలుపల నుంచి ఈద్గా వరకు డబుల్ రోడ్డు పనులు కొనసాగుతున్నాయి. ఈ విషయంపై ఆర్‌అండ్‌బీ ఈఈ గణేష్‌ను వివరణ కోరగా.. జూలూరుపాడు – పాపకొల్లు రహదారి విస్తరణ పనులు త్వరలో ప్రారంభంకానున్నట్లు తెలిపారు.



మిగులు నిధులతో రహదారి విస్తరణ పనులు జరుగుతున్న దృశ్యం

నిబంధనల మేరకు పనులు జరగాలి..



ప్రభుత్వ నిబంధనల ప్రకారం జూలూరుపాడు – పాపకొల్లు రహదారి విస్తరణ పనులు జరగాలి. గతంలో మండల కేంద్రంలో జరిగిన రహదారి, డ్రెయినేజీలు పనుల లాగా కాకుండా రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలి. సంబంధిత అధికారులు పర్యవేక్షణ ఉండాలి.

– నిమ్మటూరి లచ్చయ్య, ఆటోడ్రైవర్, పాపకొల్లు

కష్టాలు తీరనున్నాయి..



గుండ్లరేవు నుంచి జూలూరుపాడు చేరుకోవాలంటే అష్టకష్టాలు పడాల్సి వస్తోంది. సింగిల్ రోడ్డు గుంతలుగా ఉండటంతో బైక్‌పై వెళ్లడం కష్టంగా ఉంది. జూలూరుపాడు – పాపకొల్లు వరకు డబుల్ రోడ్డు నిర్మాణం ఆనందంగా ఉంది. త్వరగా పనులు పూర్తి చేయాలి.

– తుక్లూరి రమేష్, గుండ్లరేవు

ఎమ్మెల్యే కృషి ఫలితమే..



జూలూరుపాడు – పాపకొల్లు రోడ్డు సక్రమంగా లేకపోవడంతో ఎన్నో ఏళ్లుగా 15 గ్రామాల ప్రజల రాకపోకలకు ఇబ్బంది ఉంది. పాపకొల్లు రహదారి విస్తరణకు రూ. 5 కోట్లు ప్రభుత్వం మంజూరు చేయడానికి వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ కృషి ఫలితమే.

– బానోత్ నవీన్ రాథోడ్, పాపకొల్లు

ప్రతీ విద్యార్థికి అపార్ నంబర్ నమోదవ్వాలి

ఇల్లెందురూరల్: ప్రతీ విద్యార్థికి అపార్ నంబర్ నమోదు చేసేందుకు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని డీఈఓ వెంకటేశ్వరాచారి ఆదేశించారు. మండలంలోని సుభాష్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అపార్ నమోదుపై ప్రధానోపాధ్యాయులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. మాట్లాడుతూ.. జాతీయ స్థాయిలో ప్రతీ విద్యార్థికి తన చదువుకు సంబంధించి ఒక నంబర్ ఉండాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన అపార్ కోర్డులో వివరాలు నమోదవుతాయని చెప్పారు. దీనికి సంబంధించిన సాంకేతిక అంశాలపై అవగాహన కల్పించారు. ఈ ప్రక్రియలో అనుమానం వస్తే మండలం, జిల్లాకు కేటాయించిన నిపుణులను సంప్రదించాలని చెప్పారు. మూడు రోజుల వ్యవధిలో నూరు శాతం లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. సమావేశంలో ప్లానింగ్ కో–ఆర్డినేటర్ సతీష్‌కుమార్, ఎంఈఓ స్వామి పాల్గొన్నారు.

సర్వే త్వరగా పూర్తి చేయండి..



మాట్లాడుతున్న ఎంపీడీఓ ధన్‌సింగ్

ఇల్లెందురూరల్: ఇందిరమ్మ ఇంటింటి సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ ధన్‌సింగ్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో ఇంటింటి సర్వేపై సమీక్ష నిర్వహించారు. మాట్లాడుతూ.. సర్వేలో భాగంగా యజమానులు ఇంటి వద్ద లేకపోతే సమాచారం ఇవ్వడం ద్వారా వారు అందుబాటులో ఉండే సమయం తెలుసుకొని సర్వే చేయాలన్నారు. ఇతర గ్రామాలలో నివసిస్తూ సర్వే పట్ల అయిష్టత చూపితే స్థానికంగా లేరన్న సమాచారం నమోదు చేయాలని సూచించారు. ఇతర దేశాలలో ప్రస్తుతం కొత్త వైరస్ వ్యాప్తి చెందుతోందని, దీనిపట్ల ప్రజలను అప్రతమత్తం చేస్తూ జాగ్రత్తలు సూచించాలని చెప్పారు. గ్రామాలలో పారిశుద్ధ్య పనులు కొనసాగించాలన్నారు. నర్సరీ నిర్వహణ పట్ల దృష్టి సారిస్తూ మొక్కల సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో ఎంపీఓ చిరంజీవి, కార్యదర్శులు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కల్పించాలి

ఇల్లెందురూరల్: రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, రైతు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయం వద్ద అఖిల భారత రైతు సంఘం (ఏఐయూకేఎస్) ఆధ్వర్యంలో రైతులు ధర్నా నిర్వహించారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ కార్యాయలంలో అందజేశారు. ఈ సందర్భంగా మాస్‌లైన్ జిల్లా సహాయ కార్యదర్శి నాయిని రాజు మాట్లాడుతూ.. నేడు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న వారి పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. వ్యవసాయ రంగంలో సంక్షోభం తలెత్తడం కారణంగా చాలామంది రైతులు ఉపాధి కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నేతలు ప్రకటించిన విధంగా ప్రతీ రైతుకు రూ.2లక్షలు రుణమాఫీ చేయాలని, రైతు భరోసాకు ఆంక్షలు లేకుండా మంజూరు చేయాలని, 2006 అటవీహక్కుల చట్టాన్ని సమగ్రంగా అమలు చేయాలని కోరారు. బుర్ర వెంకన్న, ఆవుల కిరణ్, శంకర్, దేవ, ముత్తమ్మ, తులస్య, యాదగిరి, వెంకన్న పాల్గొన్నారు.

దోషులను శిక్షించండి..

టేకులపల్లి: జర్నలిస్టు ముఖేష్ చంద్రకర్ హత్య పిరికిపంద చర్య అని, దోషులను కఠినంగా శిక్షించాలని తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర కోకన్వీనర్ మెంతెన సంజీవరావు బుధవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వాస్తవాలను వెలికితీసే జర్నలిస్టులను హత్యలు, భౌతిక దాడులతో భయభ్రాంతులకు గురి చేయడం అవినీతిపరుల అవివేకమే అవుతుందన్నారు. హత్యలు, భౌతిక దాడులకు జర్నలిస్టులు భయపడరనే విషయాన్ని ప్రభుత్వాలు గుర్తుంచుకోవాలన్నారు. హత్య వ్యవహారంలో విచారణను వేగవంతం చేసేందుకు కాల పరిమితి విధించాలని, హంతకులను చట్ట ప్రకారం శిక్షించాలని కోరారు. జర్నలిస్టులపై పెరుగుతున్న దాడుల మీద ఆందోళన వ్యక్తం చేశారు. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల భద్రత కోసం ప్రత్యేక చట్టం తీసుకొచ్చే అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తామన్నారు.

స్టీఫెన్ హాకింగ్ జీవితం ఆదర్శం



కేక్ కట్ చేస్తున్న దృశ్యం

సూపర్‌బజార్(కొత్తగూడెం): దివ్యాంగులలో ప్రపంచంలో అత్యంత మేధావిగా పేరుగాంచిన స్టీఫెన్ హాకింగ్ జయంతి సందర్భంగా తెలంగాణ విభిన్న ప్రతిభావంతుల సంఘం (టీవీపీఎస్) ఆధ్వర్యంలో బుధవారం సంఘ కార్యాలయంలో కేక్ కట్ చేసి వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు గుండపనేని సతీష్ మాట్లాడుతూ.. నాడీ మండలానికి సంబంధించిన వ్యాధి వల్ల క్రమంగా శరీర భాగాలు చచ్చుబడి చక్రాల కుర్చీకే పరిమితమైనా తన మెదడును ఉపయోగించి కృష్ణబిలాలపై పరిశోధన చేసి కొత్త విషయాలను కనుగొన్న స్టీఫెన్ హాకింగ్ జీవితం నేటి యువతకు ఆదర్శమన్నారు. ఆయన వీల్‌చైర్‌కే పరిమితమైనా తన ఆలోచనలను కంప్యూటర్‌లో అనుసంధానించి ఖగోళ శాస్త్రంపై విస్తృతంగా ప్రయోగాలు చేసి విజయం సాధించారని, ప్రఖ్యాత ఖగోళ శాస్త్రవేత్త గెలీలియో తర్వాత అంత గొప్ప శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్ అని కొనియాడారు. ఆయన జీవితాన్ని దివ్యాంగులతో పాటు యువత ఆదర్శంగా తీసుకుని, లక్ష్యాలను సాధించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మేడి ప్రవీణ్, జగ్గుదాస్, నయీమ్, చాంద్‌పాషా, రమేష్, సతీష్, కరుణాకర్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీనుకు సన్మానం

పాల్వంచ: ఈనెల 5న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన బహుజన సాహిత్య అకాడమీ 8వ రాష్ట్ర కాన్ఫరెన్స్‌లో జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ చేతుల మీదుగా దండోర శ్రీను డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నేషనల్ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం పాల్వంచ ప్రెస్‌క్లబ్‌లో, పట్టణంలోని పలుచోట్ల ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో వివిధ సంఘాల నాయకులు శ్రీనును సన్మానించి అభినందించారు. కార్యక్రమాల్లో కాల్వ భాస్కర్‌రావు, కొత్తపల్లి సోమయ్య, కాల్వ ప్రకాష్‌రావు, కొత్తపల్లి శ్రీను, దాసరి యాకయ్య, దేవీలాల్, బాషా, ముళ్లపాటి రాజేందర్, గొడ్ల మోహన్‌రావు, గుర్రం వెంకటరత్నం, మంజూరు అలీ పాల్గొన్నారు.

ఆర్టీసీలో రక్తదాన శిబిరం

చుంచుపల్లి: జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా బుధవారం కొత్తగూడెం ఆర్టీసీ డిపోలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ మనోహర్, యూనియన్ బ్యాంక్ మేనేజర్ దేవరాజు హాజరయ్యారు. మాట్లాడుతూ.. అన్నిదానాల్లో కెల్లా రక్తదానం ఎంతో గొప్పదన్నారు. ఆర్టీసీ ఉద్యోగులు, యువకులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ దేవేందర్ గౌడ్, సూపర్‌వైజర్లు, డిపో సిబ్బంది, లయన్స్ క్లబ్ కార్యదర్శి లగడపాటి రమేష్, ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలతో సిరుల పంట



మిరపతోటను పరిశీలిస్తున్న కంపెనీ ప్రతినిధులు

జూలూరుపాడు: నాణ్యమైన అరుంధతి మిరప విత్తనాలతో రైతుల ఇంట సిరుల పంట కురుస్తుందని కృష్ణవేణి సీడ్స్ కంపెనీ మేనేజర్ వేణు అన్నారు. బుధవారం చంద్రుగొండ మండలం మేకలబండ తండాకు చెందిన అంగోత్ లఘుపతి అనే రైతు సాగు చేసిన మిరపతోటను కంపెనీ ప్రతినిధులు పరిశీలించారు. మాట్లాడుతూ.. అరుంధతి మిర్చి రకం తెగుళ్లను తట్టుకుంటుందని, అధిక దిగుబడి వస్తుందన్నారు. కార్యక్రమంలో జూలూరుపాడు శ్రీ వెంకటేశ్వర ఎంటర్‌ప్రైజెస్ యజమాని నాగేశ్వరరావు, రైతులు, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల జీతాలు చెల్లించాలి

జూలూరుపాడు: గ్రామ పంచాయతీ కార్మికుల జీతాలను తక్షణమే చెల్లించాలని బీఎస్పీ మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయ సూపరింటెండెంట్ తాళ్లూరి రవికి వినతిపత్రం అందజేశారు. తంబర్ల నరసింహారావు, గార్లపాటి సైదులు మాట్లాడుతూ.. జీపీ కార్మికులకు జీతాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం స్పందించి విడుదల చేయాలని కోరారు. మల్టీపర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేసి, పనిభారం తగ్గించాలన్నారు.

పంచాయతీ ఎన్నికలకు సిద్ధం కండి..



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే హరిప్రియ

టేకులపల్లి: రాబోయే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులు అధిక సంఖ్యలో గెలుపొందేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే బానోతు హరిప్రియ పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం రోళ్లపాడు, తొమ్మిదోమైలు తండా, బేతంపూడి, గోలియాతండా పంచాయతీల్లో తిరిగి టీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలను కలిసి గ్రామసభలు నిర్వహించారు. 36 గ్రామ పంచాయతీల్లో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు పని చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బేతంపూడి సొసైటీ చైర్మన్, జిల్లా పార్టీ నాయకుడు లక్కినేని సురేందర్‌రావు, మండల అధ్యక్షుడు వరప్రసాద్ గౌడ్, ప్రధాన కార్యదర్శి బోడ బాలునాయక్, యూత్ మండల అధ్యక్షుడు శివకృష్ణ పాల్గొన్నారు.

సొంతింటి పథకం అమలుకు పోరాడుదాం..

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్మికులకు సొంతింటి పథకం అమలుకు సీఐటీయూ చేపట్టనున్న ఆందోళన, పోరాటంలో కార్మికులు, యూనియన్ నాయకులు కలిసి రావాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మందా శ్రీనివాస్ పిలుపునిచ్చారు. బుధవారం కొత్తగూడెం ఏరియా పరిధిలోని ఆర్‌సీహెచ్‌పీలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో విజయగిరి శ్రీనివాస్, వై.వెంకటేశ్వరరావు, గడల నరసింహారావు, భూక్యా రమేష్ పాల్గొన్నారు.

‘కార్పొరేషన్’పై స్పష్టత ఇవ్వండి..



మాట్లాడుతున్న మచ్చా వెంకటేశ్వర్లు

సింగరేణి(కొత్తగూడెం): ప్రభుత్వం ప్రకటించిన కొత్తగూడెం కార్పొరేషన్ ఏర్పాటుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని, అర్బన్ స్వభావం లేని సుజాతనగర్ మండలంలోని ఏడు పంచాయతీలను కార్పొరేషన్‌లో కలపవద్దని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం స్థానిక మంచికంటి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చట్టపరమైన సమస్యలకు పరిష్కారం చూపకుండా కార్పొరేషన్ ప్రకటన చేయటం వలన ఉపయోగం లేదన్నారు. పాల్వంచ మున్సిపాలిటీ ఏజెన్సీలో 1/70 పరిధిలో ఉందని, ఎన్నికలు జరపటం లేదని, చట్టపరమైన ఈ అంశంపై స్పష్టత ఇవ్వకుండా కార్పొరేషన్ ఏర్పాటు అసంబద్ధంగా ఉందన్నారు. పాల్వంచ ఏజెన్సీనా.. కాదా.. కలెక్టర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. మణుగూరు, భద్రాచలంలో కూడ ఇదేవిధంగా ఎన్నికల ప్రక్రియ లేకుండా అధికారుల పాలనలో ఉన్నాయని తెలిపారు. అలాంటి పరిస్థితి కొత్తగూడెంకు కూడా వస్తే, కొండనాలుకకు మందేస్తే, ఉన్న నాలుక ఊడినట్లు ఉంటుందన్నారు. ఈ సమావేశంలో అన్నవరపు కనకయ్య, ఏజే రమేష్, కే.బ్రహ్మచారి. లిక్కి బాలరాజు, అన్నవరపు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి క్యాలెండర్లు ఆవిష్కరణ

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ రూపొందించిన నూతన సంవత్సరం 2025 క్యాలెండర్లను బుధవారం ఏరియా జీఎం కార్యాలయంలో జీఎం శాలేంరాజు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్, ఏఐటీయూసీ నాయకులు మల్లికార్జున్‌రావు, ఎస్‌ఓటూ జీఎం కోటిరెడ్డి, కే.హనాసుమలత, డీజీఎం (ఐఈడీ) యోహాన్, డీజీఎం పర్సనల్ శివకేశవరావు, సత్యనారాయణ, సర్వే ఆఫీసర్ మధుసూదన్‌రావు, అధికారులు పాల్గొన్నారు.

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియా జీఎం వీసం కృష్ణయ్య బుధవారం తన చాంబర్‌లో నూతన సంవత్సరం క్యాలెండర్లను ఆవిష్కంచారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఓటూ జీఎం బి.వెంకటేశ్వర్లు, ఏజీఎం (ఐఈడీ) గిరిధర్‌రావు, ఏరియా ఇంజనీర్ నరసింహారాజు, డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు, రవికుమార్, రామ్మూర్తి, అంజిరెడ్డి, మధుబాబు, దిలీప్‌కుమార్, సాయి స్వరూప్ పాల్గొన్నారు.

కార్మికులకు రోడ్డు భద్రతపై అవగాహన

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం కార్పొరేట్ ఏరియా పరిధిలోని సెంట్రల్ వర్క్‌షాపులో ఉద్యోగులకు కొత్తగూడెం వన్‌టౌన్ సీఐ కరుణాకర్ జాతీయ రోడ్డు భద్రత మహోత్సవాలలో భాగంగా బుధవారం రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. మాట్లాడుతూ.. ఇప్పుడున్న పరిస్థితుల్లో వాహనాలు అధికంగా పెరగటంతో రోడ్డుపై ట్రాఫిక్ సమస్యలు వస్తున్నట్లు చెప్పారు. డ్రైవింగ్‌లో సంయమనం పాటించాలని, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ... డ్రైవింగ్ చేయరాదని, అతివేగంగా వాహనాలను నడపొద్దన్నారు. ఇతర వాహనాలకు ఇబ్బంది కలిగేలా వాహనాలను పార్కింగ్ చేయరాదని, ఓవర్‌టేక్ చేయవద్దన్నారు. హెల్మెట్, సీటు బెల్ట్ వినియోగించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ విజయ్, సింగరేణి అధికారులు, ఉద్యోగులు, కార్మికులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: జగన్నాథపురంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో బుధవారం జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సహంలో భాగంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ ఎండీ ఫారూక్ మాట్లాడుతూ... విద్యార్థులు రోడ్లపై ఎలా ప్రవర్తించాలో, పాఠశాలలకు వెళ్లే సమయంలో ఎలాంటి జాగ్రత్తలు పాటించాలో సూచించారు. రోడ్డు భద్రతలపై వివరించిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

ఏఐకేఎంఎస్ నాయకుల సంఘీభావం



నిరసన తెలుపుతున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక చట్టాలపై 43 రోజులుగా ఢిల్లీలో ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న సంయుక్త కిసాన్ మోర్చా జాతీయ నాయకుడు జగత్‌సింగ్ దలైవాలేకి ఏఐకేఎంఎస్ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా కొత్తగూడెంలో నిరసన కార్యక్రమం నిర్వహించి, కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. మాట్లాడుతూ.. జాతీయ పార్టీ పిలుపులో భాగంగా ఈరోజు నిరసన కార్యక్రమం చేపట్టామన్నారు. గతంలో మద్దతు ధరకు చట్టబద్ధ హక్కు కల్పించాలని కోరుతూ రైతు నల్లచట్టాలను రద్దు చేయాలని కోరుతూ ఢిల్లీ కేంద్రంగా ఆందోళన కార్యక్రమాలు చేస్తే, ఆనాడు నరేంద్ర మోదీ ప్రభుత్వం రైతులను చర్చలకు పిలిచి రాతపూర్వకంగా హామీ ఇచ్చి తిరిగి మళ్లీ అధికారంలోకి వచ్చిన తరువాత ఇదే రైతులను మోసం చేసిందన్నారు. గతంలో సమ్మె చేసిన సమయంలో అనేక నిర్బంధాలను ప్రయోగించినా.. రైతులు నల్ల చట్టాలకు వ్యతిరేకంగా పోరాడిన చరిత్ర ఉందన్నారు. బీజేపీ చేసిన ఈ మోసానికి వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్య క్రమంలో ఏఐకేఎంఎస్ నాయకులు ఎస్కే ఉమర్, తుపాకుల నాగేశ్వరరావు, కుంజ కృష్ణ, పూనెం రంగయ్య, ఎట్టి నరసింహారావు, భుక్యా హర్యా, కల్తి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మోడల్ మార్కెట్‌లో లొల్లి..



చైర్మన్ డీవీతో ఘర్షణ పడుతున్న వ్యాపారులు

ఇల్లెందు: మోడల్ మార్కెట్‌లో గదులు కేటాయించేందుకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తమకు అన్యాయం జరుగుతోందంటూ పలువురు వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన మార్కెట్‌లో వ్యాపారులకు గదుల కేటాయింపు సమావేశం జరిగింది. స్థానిక వ్యాపారులు పెద్ద ఎత్తున హాజరై తమకు న్యాయం చేయాలని గదుల కేటాయింపును అడ్డుకున్నారు. మోడల్ మార్కెట్‌లో రెండు అంతస్తుల్లో నాలుగు బ్లాకులు ఉన్నాయి. ఇందులో కింది అంతస్తులో 96 గదులు, పైఅంతస్తులో 96 గదులు నిర్మించారు. కింది అంతస్తులో ఒక్కోగదికి నెలకు రూ.2000, పైఅంతస్తులో ఒక్కో గదికి రూ.1500, రూ.10 వేలు డిపాజిట్ కిరాయిగా పాలకవర్గం నిర్ణయించింది. ఈ క్రమంలో గదుల కేటాయింపునకు అధికారులు డ్రాకు సిద్ధం చేశారు. ఈ క్రమంలో మాంసం, కూరగాయల, ఫ్యాన్సీ తదితర దుకాణాల వ్యాపారులందరూ తమకు కింది అంతస్తులోనే గదులు కేటాయించాలని పట్టుపట్టారు. దీంతో గందరగోళం నెలకొంది.

సమస్యగా కింది అంతస్తులో కేటాయింపు..

కూరగాయల షాపులకు కింది అంతస్తులో అవకాశం కల్పిస్తామని ఇది వరకే హామీ ఇవ్వటం గందరగోళానికి దారి తీసింది. ఈ విషయం చిలికి చిలికి గాలివానలా మారింది. గదుల కేటాయింపు అంశం వ్యాపారుల, నాయకుల, అధికారుల ఆందోళనలతో దూషణల పర్వంగా మారింది. మరో 19 రోజుల్లో పాలకవర్గం పదవీకాలం ముగుస్తుంది. ఈ తరుణంలో ఆఘమేఘాల మీద గదుల కేటాయింపు జరగకపోతే జఠిలంగా మారే అవకాశం ఉందని ఇప్పుడే గదుల కేటాయింపు చేయాలని మున్సిపల్ పాలకవర్గం నిర్ణయం తీసుకుంది. ఏం జరుగుతుందో వేచిచూడాలి. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, మేనేజర్ అంకుషావలీ, ఆర్ఐ శ్రీనివాస్, కౌన్సిలర్లు నవీన్, సయ్యద్ ఆజమ్, కటకం పద్మావతి, సిబ్బంది పాల్గొన్నారు.